# కథ నేనున్నానని...

-శ్రీధర శ్రీరామకృష్ణ

ఉన్న పళంగా వేయి రూపాయలు కావాలి. ఎలా?

ఆలోచిస్తుంటే సారధి గుర్తుకొచ్చాడు.

సారధి నా చిన్ననాటి స్నేహితుడు. అనుకోకుండా ఓసారి బజార్లో కలిశాడు. తన కార్లో వాళ్ళింటికి తీసుకెళ్ళాడు.

ఇంకా పెళ్ళిచేసుకోలేదట. బిజినెస్‌లో తనటార్గెట్ చేరుకునే దాకా పెళ్ళిచేసుకో దల్చుకోలేదని మాటల మధ్యలో చెప్పాడు. అప్పట్నుంచి అప్పుడప్పుడు వాడి దగ్గరి కెళ్ళటం సరదాగా గడపటం అలవాటయింది. నేను అక్కడికెళ్ళటమే గానీ ఎప్పుడూ వాణ్ణి మా ఇంటికి ఆహ్వానించే సాహసం చేయలేదు.

కారణం నా పరిస్థితి.

నేనొచ్చిన గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాను. చాలీ చాలని జీతం. నాలుగొందల అద్దెతో, ఇద్దరు పిల్లలతో ఇరుకు పోర్షన్‌లో జీవితం వెళ్ళ బుచ్చుతున్నాను.

నిజం చెప్పాలంటే, వాణ్ణి మా ఇంటికి ఆహ్వానిస్తే నా పరిస్థితి చూసి వాడు నాతో ఫ్రెండ్ షిప్ ఎక్కడ కట్‌చేసుకుంటాడోనని నాభయం. దానికి తగ్గట్టు వాడూ ఎప్పుడూ నాగురించి వివరాలడగలేదు.

సారధికి నిజం చెప్పేస్తే వేయి రూపాయలు తప్పకుండా ఇస్తాడు.

కానీ వాడి దృష్టిలో నేను చులకన అయిపోతా నేమో!

అక్కడికీ ఎవర్నీ అప్పు అడక్కుండా జాగ్రత్తగా ఉన్నంతలోనే కాలక్షేపం చేసుకుంటూ వస్తున్నాను.

కానీ ఉన్నట్టుండి లక్ష్మికి కడుపునొప్పి వచ్చింది.

ఒకట్రెండు రోజులు మందుల షాపులో ఏవో టాబ్లెట్లు పట్టుకొచ్చిస్తే, కాస్త తగ్గినట్టుగా తగ్గి మళ్ళీ ఉధృతమైపోయింది.

• కట్టుకున్న పెళ్ళాం బాధతో లుంగచుట్టుకు పోతుంటే, చూళ్ళేక హాస్పిటల్‌లో చేర్పిం చాను.

రెండ్రోజులు అక్కడే ఉంచాల్సి వచ్చింది. ఏవో టెస్టులనీచేసి, మందులిచ్చి, వైద్యంచేసి డాక్టర్లు కడుపునొప్పి తగ్గించారు.


హాస్పిటల్ బిల్లు తొమ్మిదొందల చిల్లరయింది. జీతంతో ఆ బిల్లు కట్టేశాను.

కానీ ఇంటద్దె, పాతబాకీ, మరికొన్ని చిల్లరబాకీలు అలాగే మిగిలిపోయాయి.

పరిస్థితి వివరించి, సారధిని అప్పు అడగాలంటే అహం అడ్డువస్తోంది.

మరైతే ఎలా?

ఉన్నట్టుండి మరో ఆలోచన వచ్చింది.



రేపు నా శ్రీమతి పుట్టిన రోజనీ, గోల్డ్‌నెక్లెస్ ప్రెజెంట్ చేయదల్చుకున్నాననీ, దానికి వేయి రూపాయలు తక్కువయ్యాయనీ అబద్ధం చెప్తే ఎలా ఉంటుంది?

ఆలోచన అద్భుతంగా ఉన్నట్లనిపించింది.

అలా అనిపించటంతోటే సారధి ఇంటివేపు

ఉత్సాహంగా నడవసాగాను.

ఎంత ఉత్సాహంగా అంటే రెండే రెండు నిమిషాల్లో సారథి ఇంటిని సమీపించేటంత.

సారథి ఇంటి కాలింగ్ బెల్ నొక్కేముందు నన్ను నేను ఒకసారి చూసుకున్నాను. ఓ మిత్రుడి దగ్గర ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో బట్టలు తీసుకుని, రెండు జతలు ఈ మధ్యే కుట్టించుకున్నాను.

అందులో ఒకటి వేసుకొని, పెళ్ళికి మామగారు పెట్టిన మంచివాచీ చేతికి ధరించి, పెద్దగా అరిగిపోని చెప్పులకి పాలిష్‌వేసుకుని, ఆదివారం కావటం మూలంగా ఉదయమే ఆయిల్‌బాత్ చేసి మనిషిని కొత్త చూడముచ్చటగానే తయారయ్యాను.

ఫరవాలేదు. అప్పుకోసం అబద్ధం చెప్పినా అది నిజమని పించేట్టుగానే ఉంది నా వేషం.

సంతృప్తిగా ఊపిరి పీల్చుకుని కాలింగ్ బెల్ నొక్కాను.

క్షణాలలో తలుపు తెరుచుకోవటం, చిరునవ్వుతో సారథి గుమ్మంలో నిలబడి సాదరంగా లోపలికి ఆహ్వానించటం జరిగాయి.

లోపలికెళ్ళి సోఫాలో కూర్చున్నాను. ఎంతఫ్రీగా ఫీలవుదామన్నా ఏదో అసౌకర్యంగా ఉన్న భావన కలుగుతోంది.

'జస్టెమినిట్!' అంటూ లోపలికి వెళ్ళి వేయించిన జీడి పప్పుపొట్లాలు ట్రేలో పెట్టుకుని తీసుకొచ్చి టీపాయ్ మీదుంచాడు.

వాడు ఏదేదో మాట్లాడ్తూ ఉన్నాడు. కాని.. నేనెంత ప్రయత్నించినా ఫ్రీగా ఉండలేక పోతున్నాను...

బహుశా, అప్పు అడగాల్సి రావటమంత ఇబ్బంది కరమైన పరిస్థితి మనిషి జీవితంలో మరొకటి ఉండదనుకుంటాను.

నేను మూడీగా ఉన్నట్టు గ్రహించినట్టున్నాడు. 'ఏంటిరా! బాగా స్లోగా ఉన్నావ్! దేని గురించి అంత సీరియస్ ఆలోచన?' అన్నాడు.

'అబ్బే ఏంలేదు. మామూలుగానే ఉన్నానే'

వాడెందుకో నన్ను నఖశిఖ పర్యంతం చూస్తున్నాడు. నాకది మరికొత్త ఇబ్బందిగా అన్పించింది! వాడది గ్రహించాడో ఏమో నాకేసి చూడటం మానేసి 'షర్ట్ కొత్తదా' అడిగాడు.

'అవును. ఈ మధ్యే కుట్టించాను' నేను తడబడుతూ సమాధానం చెప్పాను.

ఆ తర్వాత మేమిద్దరం ఎక్కువగా మాట్లాడుకోలేదు.

విస్కీ తాగటం పూర్తయింది.

మధ్యలో వాణ్ణి అప్పు అడుగుదామని నోటిదాకా రావటం, ఎంత ప్రయత్నించినా మాట గొంతు దాటకపోవటం రెండు మూడుసార్లు జరిగింది.

'డబ్బు ఎవరినైనా అడగచ్చులే. అనవసరంగా మిత్రుడి దగ్గర వెలితి పడటం ఎందుకు?' అని కూడా అనిపించకపోలేదు.

ఇంటికెళ్ళి పోదామనుకుని లేచి తల దువ్వుకోవటం కోసం నిలువు టద్దంలో చూసుకున్నాను.

మొహం అంతా జిడ్డుకారినట్టుగా అసహ్యంగా ఉంది. షర్టు విప్పి హేంగరికి తగిలించి, మొహం కడుక్కొస్తానని చెప్పి బాత్‌రూమ్‌లో దూరాను.

'సరే. వెళ్ళిరా' అని వాడు బెడ్ రూమ్‌లో కెళ్ళాడు.

నేను బాత్‌రూమ్‌లోంచి బయటపడేసరికి తువ్వాలుతో సిద్ధంగా నిలబడి ఉన్నాడు.

వాడి చేతులోంచి టవల్ తీసుకుని మొహం తుడుచుకుని, పక్కటేబుల్ మీదున్న పౌడర్ డబ్బా తీసుకుని కొన్త రాసుకుని, తలదువ్వుకుని, హేంగరకున్న షర్ట్ తీసుకు వేసుకుని, 'వస్తామురా' అన్నాను.

'సరే!' అంటూ కరచాలనం చేశాడు. వాడి మొహంలో ఆప్యాయతతో కూడిన చిరునవ్వు కనిపించింది.

రెండు నిమిషాలలో రోడ్డుమీద కొచ్చాను.

'రేపటిలోపు వేయి రూపాయలు సంపాదించట మెలా!' అని ఆలోచించుకుంటూ ఇంటివేపు నడుస్తున్నాను.

ఎందుకో షర్టు జేబుకొస్త బరువుగా అనిపించింది. జేబులో చెయ్యిపెట్టి చూసుకున్నాను.

ఒక కవరు, ఎర్రని కాయితం ఉన్నాయి.

ఆ కాయితం ఏమిటా అని చూశాను. అది మా ఆవిడ హాస్పిటల్ బిల్. జేబులోంచి తీయటం మర్చిపోయినట్టున్నాను.

మరి కవరేమిటి?

అటూ ఇటూ తిప్పిచూశాను. అంటించి ఉంది. ఆశ్చర్యంతోనూ, ఆతృతతోనూ విప్పిచూశాను. దాంట్లో రెండు ఐదువందల రూపాయల నోట్లతో బాటు చిన్న చీటీ ఉంది.

దాంట్లోని అక్షరాల వెంట నాచూపులు పరిగెత్తాయి.

ఒరేయ్!
ఇబ్బందులన్నవి అందరికీ వస్తుంటాయి. మిత్రుల దగ్గర చెప్పుకోటానికి కూడా మొహమాటపడితే ఎలా?

ఆపదల్లో ఆదుకున్నవాడే నిజమైన మిత్రుడని మన చిన్నప్పుడు సుబ్బారావు మాస్టారు చెప్పేవారు. గుర్తుందా!

చివర్న సంతకం లేదు. సారథి మొహం కనిపించింది.

నాకు ఆనందంతో బాటు ఆశ్చర్యం కూడా కలిగింది.

దాంతోబాటు మనసులో సారథి పట్ల కృతజ్ఞతా భావం పొంగి పొర్లింది.

మొదటిది. నేను అడగకుండానే నా ఇబ్బందిని గ్రహించి ఆదుకున్నందుకు.

రెండోది. వేరే వాళ్ళ దగ్గర చేయిజాపే పరిస్థితిని తప్పించినందుకు.

ఎక్కడి నుండో పాట విన్పిస్తోంది...

నేనున్నానని.. నిండుగ పలికే తోడొకరుండిన అదే భాగ్యమూ.. అదే సౌఖ్యమూ...★

